
సాక్షి
కుమురం భీం

సోమవారం। 20। జనవరి। 2025



'బర్డ్‌వాక్' సక్సెస్
జన్నారం అటవీ డివిజన్‌లో నిర్వహించిన బర్డ్‌వాక్ ఫెస్టివల్ విజయవంతమైంది. పక్షి ప్రేమికులు రకరకాల పక్షులను చూసి మురిసిపోయారు. 8లో▸



కొంగు బంగారం 'గొంతెమ్మ'..!
పెంచికల్‌పేట్ మండలంలోని మేరెగూడలో వెలిసిన గొంతెమ్మ (కుంతీదేవి) ఆలయంలో సోమవారం బోనాల పండుగ నిర్వహించేందుకు గిరిజనులు ఏర్పాట్లు చేశారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.2 /13.1
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత సాధారణంగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది. ఉష్ణోగ్రత తగ్గుతుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

మొక్కుకు బ్రేక్!

- జంగుబాయి దర్శనానికి వెళ్తుండగా ఐచర్ బోల్తా • డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం
- ఒకరు మృతి, 47 మందికి గాయాలు • మరొకరి పరిస్థితి విషమం
- మాలేపూర్ ఘాట్ వద్ద ఘటన • రిమ్స్, నార్నూర్, ఉట్నూర్ ఆస్పత్రులకు క్షతగాత్రుల తరలింపు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, తదితరులు



మాలేపూర్ ఘాట్ రెండో మలుపు వద్ద బోల్తా పడిన ఐచర్ వాహనం



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

వారంతా తమ ఇలవేల్పు జంగుబాయి పుణ్యక్షేత్రంలో మొక్కు తీర్చుకుందామని సంతోషంగా బయల్దేరారు. ఐచర్‌లో ప్రయాణిస్తూ ముచ్చట్లలో నిమగ్నమయ్యారు. మరికాసేపట్లో ఆలయానికి చేరుకునే వారే. ఈ క్రమంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం. తేరుకునే లోపే వాహనం బోల్తా పడింది. ఏం జరిగిందో తెలియని పరిస్థితి. అందులో ఉన్న వారు ఒకరిపై ఒకరు పడ్డారు. మరికొంత మంది కింద పడిపోయారు. తీవ్ర గాయాల పాలవడంతో ఆర్తనాదాలు, హాహాకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. చాలా మంది కదిలే పరిస్థితి కూడా లేక పోవడంతో ఉన్నచోటే రోధించారు. స్థానికులు గమనించి పోలీసులు, అంబులెన్స్‌లకు సమాచారం అందించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. మొక్కు తీర్చకుండానే తిరుగు పయనమవ్వాల్సిన పరిస్థితి.

– ఆదిలాబాద్‌టౌన్/నార్నూర్/గుడిహత్నూర్/ఉట్నూర్‌రూరల్

గుడిహత్నూర్ మండలంలోని సూర్యగూడ, ఇంద్రవెల్లి మండలంలోని సాలెవాడకు చెందిన ఆదివాసీలు జంగుబాయిని దర్శించుకోవడానికి ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ఐచర్‌లో 70 మంది బయలు దేరారు. సూర్యగూడకు చెందిన మాజీ సర్పంచ్ కుమ్ర లింగు దీక్షలో ఉండగా వీరిని కాప్లే జంగుబాయి వద్ద పుణ్యస్నానాలు, దర్శనం కోసం తీసుకెళ్లారు. ఈ క్రమంలో సాయంత్రం 4గంటల సమయంలో నార్నూర్ మండలంలోని మాలేపూర్ రెండోమూలమలుపు ఘాట్ వద్ద వాహనం అదుపు తప్పింది. డ్రైవర్ వాహనాన్ని న్యూట్రల్ చేయడంతోనే ప్రమాదం సంభవించిందని అందులో ప్రయాణిస్తున్న పలువురు పేర్కొన్నారు. మద్యం మత్తులో వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ఉండవచ్చని మరికొందరు తెలిపారు. ప్రమాదంలో 47 మందికి గాయలవగా ఇందులో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌తో పాటు ఉట్నూర్, నార్నూర్ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గుడిహత్నూర్ మండలం సూర్యగూడకు చెందిన కుమ్ర మల్కు (60) మృతిచెందాడు. మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది.

లోయలో పడ్డ వాహనం..

డ్రైవర్ అజాగ్రత్తతో పాటు డీజిల్ ఆదా చేయాలనే కక్కుర్తితోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మొదటి ఘాట్ వద్ద న్యూట్రల్ చేయగా, రెండో ఘాట్ వద్ద వాహనం వేగంతో ముందుకెళ్లింది. ఆ సమయంలో బ్రేక్ వేసినప్పటికీ పడకపోవడంతో డ్రైవర్ తన ప్రాణాలు కాపాడుకునేందుకు అందులో నుంచి బయటకు దూకాడు. వాహనం మొదట రోడ్డు పక్కనున్న స్తంభాలను, ఆ తర్వాత చెట్లను ఢీకొట్టింది. మొదటి చెట్టు విరిగిపోగా రెండో చెట్టు వద్ద బోల్తా పడింది. అందులో ఉన్నవారు చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ సంఘటనను చూసి డ్రైవర్ అక్కడినుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి, భీంపూర్‌కు చెందిన గ్రామస్తులు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించేందుకు ప్రయత్నించారు. పోలీసులు, 108కు సమాచారం అందించారు. స్వల్ప గాయాలైన వారిని నార్నూర్ ఆస్పత్రికి, తీవ్ర గాయాలైన వారిని ఉట్నూర్, రిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. చిన్న పిల్లలకు సైతం స్వల్ప గాయాలయ్యాయి.

క్షతగాత్రులు వీరే..

ప్రమాదంలో ఐదుగురు తీవ్ర గాయాల పాలు కాగా, ఇందులో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వృద్ధులకే ఎక్కువ గాయాలయ్యాయి. ఎక్కువ మందికి కాళ్లు, తల, నడుము భాగాల్లో దెబ్బలు తగిలాయి. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో సూర్యగూడకు చెందిన కుమ్ర రాంబాయి, కుమ్ర భీంరావు, వైజాపూర్‌కు చెందిన మెస్రం నాని, సోయగూడకు చెందిన సోయం జంగుబాయి ఉన్నారు. ఉట్నూర్ ఆస్పత్రిలో పూర్ణబాయి, కుమ్ర సీతాబాయి, కుమ్ర పాండు, కుమ్ర ప్రవీణ్, జుగాదిరావు, శివకుమార్, యాదవ్‌రావు ఉన్నారు. మిగతా వారు నార్నూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలియడంతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పది మంది వైద్యులు, సిబ్బందితో పాటు స్ట్రెచ్చర్లను అందుబాటులో ఉంచారు. వారికి వైద్య సేవలు అందించారు. సూపరింటెండెంట్ అశోక్ పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా క్షతగాత్రులను తరలించేందుకు సిరికొండ, ఇంద్రవెల్లి, ముత్నూర్, ఉట్నూర్, హస్నాపూర్, లోకారి(కె), గాదిగూడ, జైనూర్‌ల నుంచి మొత్తం తొమ్మిది 108 అంబులెన్సులు సేవలు అందించాయి. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని సీఐ రహీం పాషా తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

సంఘటనపై ఆరా తీసిన ఖానాపూర్ ఎమ్మెల్యే..

ఐచర్ వాహనం బోల్తా పడ్డ విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఫోన్ ద్వారా ఉట్నూర్ ఆస్పత్రి వైద్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని రిమ్స్, హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయునికి కవి శ్రేష్ఠ పురస్కారం



అభిలాష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌అర్బన్/వాంకిడి: జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, కవి డాక్టర్ నూతి అభిలాష్ ఆదివారం కవి శ్రేష్ఠ పురస్కారం అందుకున్నారు. అభిలాష్ తెలుగు, ఆంగ్ల భాషల్లో అనేక రచనలు చేశారు. ఆయన కృషికి గుర్తింపుగా కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్ వేదికగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీ గౌతమేశ్వర సాహితి కళా సేవా సంస్థ, ఆర్యాణీ సకల కళా వేదిక సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవులు వైరాగ్యం ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, నిర్వాహకుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

చప్రాడాలో పల్లకిసేవ



పల్లకిసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

బెజ్జూర్: మహారాష్ట్రలోని చప్రాడా ఆధ్యాత్మిక కేంద్రంలో కార్తీక స్వామి పల్లకిసేవ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక స్వామి సమాధిని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, సిర్పూర్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ దర్శించుకున్నారు. అనంతరం దత్త అవతార్ కార్తీక్ స్వామి బాబా చిత్రపటంతో పల్లకిసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సతీష్, బీజేపీ నాయకులు భాస్కర్, రాజు, సామల తిరుపతి, మధుకర్, ఉమ్మెర బాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, బెజ్జూర్, కౌటాల, కాగజ్‌నగర్‌కు చెందిన భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి

పెంచికల్‌పేట్: విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని కమ్మర్‌గాంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామానికి చెందిన యువకులు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్సీకి వివరించగా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన మొర్లిగూడ జట్టుకు ప్రథమ బహుమతి రూ.15వేలతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి కమ్మర్‌గాం జట్టుకు రూ.10వేలు, షీల్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సముద్రాల సరిత రాజన్న, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, రాచకొండ కృష్ణ, పాల్గొన్నారు.


పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

వాంకిడి: పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు. ఆదివారం ఉదయం జాతీయ రహదారిపై గల సరాండి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఐచర్ వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా 17 ఆవులు, 4 ఎద్దులు, 5 గేదెలు తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన శైలాని, ఖైంసాకు చెందిన సులేమాన్, ఫసి, గోయెగాంకు చెందిన షేక్ అబ్దుల్, ఆసిఫాబాద్‌కు చెందిన షేక్ మోసిన్, కెరమెరికి చెందిన అజ్జును అదుపులోకి తీసుకుని విచారించగా మహారాష్ట్రలోని గోండ్ పిప్పిరి నుంచి నిజామాబాద్‌లోని సటాపుర్ మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.


నేడు ప్రజావాణి రద్దు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నేడు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రె ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే కార్యక్రమం కొనసాగుతున్న దృష్ట్యా అధికారులు సర్వే ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని, ఈ కారణంగా సోమవారంనాటి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.

'పంచాయతీ' గుర్తులు ఖరారు



సర్పంచ్ అభ్యర్థుల మోడల్ బ్యాలెట్



వార్డు సభ్యుల అభ్యర్థుల మోడల్ బ్యాలెట్

- సర్పంచులకు 30.. వార్డు సభ్యులకు 20
- 'బ్యాలెట్' పేపర్ల ముద్రణకు కసరత్తు షురూ
- మొదలైన బాక్సుల మరమ్మతులు

కైలాస్‌నగర్: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు చేపట్టిన అధికార యంత్రాంగం తాజాగా అభ్యర్థులకు కేటాయించనున్న గుర్తులను ఖరారు చేసింది. సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు అభ్యర్థులకు 20 గుర్తులు కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. వాటికి అనుగుణంగా జిల్లా స్థాయిలో బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అధికారులు చర్యలు చేపట్టారు.

సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు

సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలు పార్టీ రహితంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తెలిసిన గుర్తులు కేటాయించారు. సర్పంచ్ బ్యాలెట్ పత్రం గులాబీరంగులో ఉంటుంది. సర్పంచ్ అభ్యర్థులకు బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, లేడీ పర్స్, టీవీ రిమోట్, టూత్‌పేస్ట్, పాన, చెత్తడబ్బా, బ్లాక్‌బోర్డ్, బెండకాయ, కొబ్బరితోట, డైమండ్, బకెట్, డోర్ హ్యాండిల్, టీజల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, పడవ, బిస్కెట్, వేణువు, చైన్, చెప్పులు, గాలిబుడగ లాంటి గుర్తులు ఉంటాయి.

వార్డు అభ్యర్థుల గుర్తులు

వార్డు అభ్యర్థుల బ్యాలెట్ తెలుపు రంగులో ఉంటుంది. గౌను, గ్యాస్‌స్టౌ, స్టూల్, సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటినా, గరాట, మూ కుడు, ఐస్‌క్రీమ్, గాజుగ్లాస్, పోస్టుడబ్బా, కవర్, హాకీ కర్ర బంతి, నెట్, కటింగ్ ప్లేయర్, బాక్స్, విద్యుత్ స్తంభం, కేతిరి తదితర గుర్తులుంటాయి.

బ్యాలెట్ల ముద్రణకు సర్వం సిద్ధం

పంచాయతీ ఎన్నికల్లో వినియోగించే బ్యాలెట్ పేపర్ల ముద్రణను జిల్లా స్థాయిలోనే చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆయా జిల్లాల అధికారులు ఇందుకు కసరత్తు ప్రారంభించారు. బ్యాలెట్‌ల ముద్రణకుఏ ఇప్పటికే ఆయా జిల్లాల ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు దరఖాస్తు చేసుకోగా, వారికి అధికారులు బాధ్యతలు అప్పగించనున్నారు.

నోటా కూడా..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరు నచ్చకుంటే వారిని తిరస్కరించే అవకాశాన్ని ఓటర్లకు ఈసీ కల్పించింది. బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు నోటా గుర్తును బ్యాలెట్ పేపర్‌పై ముద్రించనున్నారు. పోటీలో ఎందరు అభ్యర్థులున్నా వారి గుర్తులతో పాటు అదనంగా నోటాను ముద్రించనున్నారు.

'ప్రజలకు సేవ చేసేందుకే కాంగ్రెస్‌లో చేరాం'



మాట్లాడుతున్న అర్షద్ హుస్సేన్, సిడాం గణపతి

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరామని టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఇంటిముందు కార్యకర్తలను పోగు చేసి ఎమ్మెల్సీ దండే విఠల్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలపై శనివారం అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి సంకల్పంతోనే కాంగ్రెస్‌లో చేరామని, మీలా అధికారం అడ్డుపెట్టుకుని దోచుకోవడానికి కాదన్నారు. పార్టీలో ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలే గానీ ఇలా రోడ్ల మీదికి వచ్చి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మాజీ జెడ్పీటీసీ పద్రం పుష్పలత, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ వర్ధన్, మాజీ సర్పంచ్ ఉమ్మెరి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరింత చేరువగా 'సహకారం'

దేశంలో ఐదు సంవత్సరాల్లో రెండు లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా మండలాల రైతుల నుండి వచ్చిన అభ్యర్థనల మేరకు నూతనంగా జిల్లాలో 3 సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు.

- జిల్లాలో మరిన్ని సహకార సంఘాలు
- 12 సంఘాలు, 23,788 మంది సభ్యులు
- కొత్తగా మూడింటికి ప్రతిపాదనలు



ఆసిఫాబాద్‌లోని సహకార సంఘ కార్యాలయం

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచే సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సహకార సంఘాల సేవలను మరింత విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ముందుగా ఆయా పీఏసీఎస్‌లు, ఎమ్మెల్యేల నుండి ప్రతిపాదనలను జిల్లా సహకార శాఖ స్వీకరించింది. జిల్లాలో నూతనంగా 3 సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు.

గ్రామాల్లో సేవల విస్తరణకు..

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 12 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 23,788 మంది సభ్యులు ఉన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు, పంట రుణాల పంపిణీ, గిడ్డంగులు, పెట్రోల్ బంకులు, ఇలా పలు సేవలను రైతులకు అందిస్తున్నాయి. కొత్తగా మండలాలు ఏర్పడినప్పటికీ మండల కేంద్రాల్లో పీఏసీఎస్‌లు లేవు. ఈ క్రమంలో అన్ని మండల కేంద్రాల్లో, అవసరం ఉన్న గ్రామాల్లో సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

15కు చేరనున్న సంఘాలు

గతంలో నష్టాల్లో ఉన్న సంఘాలను మరో సంఘంలో విలీనం చేశారే తప్పా కొన్నేళ్లుగా నూతన సంఘాలు ఏర్పాటు చేయలేదు. పలు పాత, కొత్త మండల కేంద్రాల్లో సైతం సంఘాలు ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వం మండలానికి రెండు చొప్పున సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు స్వీకరించింది. కానీ ఆచరణకు నోచుకోలేదు. కొత్తగా 3 సంఘాలు ఏర్పాటు చేస్తే జిల్లాలో సహకార సంఘాల సంఖ్య 15కు చేరనుంది. దీంతో రైతులకు అందుబాటులో సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతిపాదనలు స్వీకరించాం. అందరి అభిప్రాయాలు తీసుకుని నివేదించాం. జిల్లాలో కొత్తగా పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, లింగాపూర్‌లో సంఘాలను ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. నూతనంగా ఏర్పడే సంఘాలతో రైతులకు మరింత మేలు జరిగే అవకాశం ఉంది.

– రాథోడ్ బిక్కు, జిల్లా సహకార అధికారి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకు యోగ్యం కాని రాళ్లు, గుట్టలు, నివాస గృహాలు, వెంచర్లు, లేఅవుట్లు, అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూములు, ఇరిగేషన్ భూములు, చెరువులు, కాలువలు, రహదారులు, రైల్వేలైన్‌ల కోసం కేటాయించిన భూములను రైతు భరోసా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితాను రూపొందించాలన్నారు. అర్హత గల ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డు అందేలా చూడాలన్నారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పథకాల వారీగా అధికారులను నియమించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మండలంలోని ఎస్టీవోస్ కాలనీలో రేషన్‌కార్డుల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈకార్యక్రమంలో సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్, డివిజన్‌లోని తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం సల్పాలగూడలోని చీకటి భీమయ్యక్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, నాయకులు భీమేశ్, శ్రీకాంత్, లక్ష్మణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మానిక్‌పటార్ గ్రామాన్ని తొలగిస్తే ఊరుకోం

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఆర్ఎస్‌పీకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కాగజ్‌నగర్‌రూరల్: టైగర్ రిజర్వు ప్రాంతంగా పరిగణిస్తూ మానిక్‌పటార్ గ్రామాన్ని తొలగిస్తే ఊరుకునేదిలేదని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలంలోని మానిక్‌పటార్ గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా నివాసం ఉంటున్న గ్రామస్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడంలేదని, కనీసం పక్కా ఇళ్లు, రోడ్డు సౌకర్యంలేదన్నారు. కనీస మౌళిక సదుపాయాలు కల్పించలేదన్నారు. గోండు వీరుడు కుమురంభీం ఉద్యమకాలం నుంచి ఈ గ్రామం ఉందని, ఇప్పుడు తీసివేస్తే ఇక్కడి ప్రజలు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. కుమురంభీం స్ఫూర్తితో ప్రజల కోసం పోరాడుతామన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భూములకు పట్టాలిచ్చి రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం పట్టా భూములకు రుణం కూడా ఇచ్చే పరిస్థితిలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, కో కన్వీనర్ రాంప్రసాద్, యూత్ కన్వీనర్ రాజు, కాగజ్‌నగర్ మండల కన్వీనర్ ఆవుల రాజ్‌కుమార్, నాయకులు నవీన్, షేక్‌చాంద్, అస్లాం, వాసు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడిపై పోక్సో కేసు

ఆదిలాబాద్‌టౌన్: మైనర్ బాలికను అపహరించిన యువకుడిపై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సుందరయ్యనగర్‌కుచెందిన చౌహాన్ అంకుష్..పట్టణానికి చెందిన మైనర్ బాలికను ఈనెల 10న కళాశాలకు వెళ్లిన సమయంలో ప్రేమ పేరిట మాయమాటలు చెప్పి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం


లక్ష్మణ్ (ఫైల్)

ఖానాపూర్: అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యమైందని ఏఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన హట్వాల్ లక్ష్మణ్ (74) ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మండలంలోని సుర్జాపూర్ పొలిమేరలోని అప్పికుంటలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం ఉందని సమాచారం అందింది. మృతదేహాన్ని బయటకు తీయించి కు టుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని లక్ష్మణ్‌గా గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి భార్య శకుంతల, ఒక కూతురు, నలుగురు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని ఇప్పల్‌నౌగాం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన సేండే హరికృష్ణ (20) పని నిమిత్తం బైక్‌పై వాంకిడికి వెళ్లి తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఉట్నూర్‌రూరల్: పురుగుల మందు తాగిన వ్యక్తి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉట్నూర్‌సీఐ మొగిలి కథనం ప్రకారం.. మండలంలోని ఎక్స్‌రోడ్డు గ్రామానికి చెందిన రాథోడ్ గోకుల్ (40) మద్యానికి బానిసయ్యాడు. తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మద్యం కొనుగోలు కోసం అప్పులు చేసేవాడు. కుటుంబ సభ్యులు నచ్చజెప్పినా మారలేదు. ఈనెల 12న సాయంత్రం మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. భార్య మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. కుమారుడు రాథోడ్ లోకేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బర్డ్‌వాక్ సక్సెస్


పక్షులను ఫొటోలు తీస్తున్న పక్షి ప్రేమికులు


మల్యాల వాచ్‌టవర్ వద్ద బర్డ్ వాచర్లు

- తరలివచ్చిన పక్షి, ప్రకృతి ప్రేమికులు
- పక్షులను కెమెరాల్లో బంధించిన బర్డ్‌వాచర్లు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన బర్డ్‌వాక్ ఫెస్టివల్ విజయవంతమైంది. డివిజన్‌లో ఈ సంవత్సరం నాలుగుసార్లు నిర్వహించారు. చివరిసారి బర్డ్‌వాక్‌కు హైదరాబాద్, వరంగల్, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల నుంచి పక్షి, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు తరలివచ్చారు. జిల్లా అట వీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు రేంజ్ అధికారి సుష్మారావు ఆధ్వర్యంలో బర్డ్ వా చర్లకు భోజనం, బస, సఫారీ సౌకర్యం కల్పించా రు. బైసన్‌కుంట ప్రాంతంలో రాత్రి బస ఏర్పాటు చేశారు. ఉదయం కుంట సమీపంలో పక్షులను వారు కెమెరాల్లో బంధించారు. నీలుగాయి కుంట, మల్యాల వాచ్‌టవర్ వరకు సఫారీలో ప్రయాణించి, వన్యప్రాణులను నేరుగా చూసి మురిసిపోయారు. పరిసర ప్రాంతాల్లో 53 వరకు పక్షులను గుర్తించారు. బర్డ్‌వాచర్లను 'సాక్షి'పలుకరించగా తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

పక్షులను చూసి మురిసిపోయారు

నా హయాంలో ఇది నాలుగవ బర్డ్‌వాక్ ఫెస్టివల్. 16 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కొందరు అనివార్య కార్యణాలతో వల్ల రాలేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12 మంది పక్షులు, జంతువులను చూసి మురిసిపోయారు. ఈ ప్రాంత విశేషాలను తెలియజేయడానికి ఉన్నతాధికారుల ఆదేశాలతో బర్‌వాక్ నిర్వహిస్తున్నాం. అటవీ అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

– సుష్మారావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి

రెండోసారి వచ్చాను



పర్యావరణం కాపాడటం కోసం ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఏర్పాటు చేసుకున్నాం. వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రకృతి, పర్యావరణాన్ని అధ్యయనం చేస్తుంటాం. అందులో భాగంగా ఇక్కడ బర్డ్‌వాక్ వస్తే అవగాహన కలుగుతుంది. రెండుసార్లు బర్డ్‌వాక్‌కు హాజరయ్యాను. నాతోపాటు మరికొందరిని తీసుకువచ్చాను.

– పిట్టల రవిబాబు, పర్యావరణవేత్త, వరంగల్

జీవ వైవిధ్యానికి ఆయువుపట్టు



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని అడవులు వివిధ రకాల పక్షులు, జంతువులు, సరిసృపాలు, చెట్లు లాంటి వాటికి పుట్టినిల్లు. ఈ ప్రాంతం జీవ వైవిధ్యానికి ఆయువుపట్టు. ఇక్కడ 53 రకాల పక్షులు, అడవి బర్రెలు, నీలుగాయి, దుప్పి, ఎలుగుబంట్లు గుర్తించాను. ఇక్కడి వాతావరణం, జీవ వైవిధ్యం ఆకట్టుకుంది.

– శ్యాంసుందర్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

మొదటిసారిగా వచ్చాను



స్నేహితుల ద్వారా బర్డ్‌వాక్ తెలుసుకున్నాను. మొదటిసారిగా స్నేహితులతో కలిసి అడవులకు వచ్చాను. రాత్రి దట్టమైన అడవిలో బస చేయడం కొత్త అనుభూతినిచ్చింది. వివిధ రకాల జంతువులు, పక్షుల అరుపులు విన్నాం. టెంట్లు, ఫైర్‌క్యాంపు అద్భుతంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ రక్షణపై అవగాహన వస్తుంది. – రాంచందర్, హైదరాబాద్

కంపెనీ క్వార్టర్ల సందర్శన


కార్మిక కుటుంబాలతో మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలో కంపెనీ క్వార్టర్లను సందర్శించారు. కార్మిక కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో క్వార్టర్లు ఊరుస్తున్నాయన్నారు. కాలనీల్లో తాగునీరు పరిశుభ్రంగా ఉండడం లేదన్నారు. విద్యుత్ వైరింగ్ అధ్వానంగా ఉందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందన్నారు. కార్మికులకు కంపెనీ సొంతింటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్రాంచి ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్, రాజమౌళి, నరహరి, ఖాదర్ పాషా, రాజగోపాల్, సదానందం, సుధాకర్, లక్ష్మణ్, శ్రీపతి బానేష్ తదితరులు ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ఐదుగురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనారోగ్యంతో రైతు, కడుపునొప్పి భరించలేక యువకుడు, మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకున్నారు. ఆర్థిక సమస్యలతో యువకుడు చెరువులో దూకాడు. రైలు కిందపడి యువతి ఆత్మహత్య చేసుకుంది.

ఉరేసుకుని రైతు

లక్ష్మణచాంద: అనారోగ్యంతో రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రాచాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాచాపూర్ గ్రామానికి చెందిన రైతు బన్నెబోయిన పోశెట్టి (48), రాజమణి దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉండగా పెళ్లిళ్లు చేశారు. వ్యవసాయం చేసుకుంటూ వీరు జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా పోశెట్టి మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నాడు. గత 15 రోజుల క్రితం నిర్మల్ ఏరియాస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నాడు. అయినా మోకాలి నొప్పి రావడం, శస్త్రచికిత్స చేసుకున్నా నయం కాలేదని తీవ్రమనస్తాపం చెందాడు. శనివారం రాత్రి తన పాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమలత అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి వ్యక్తి..


ప్రసాద్(ఫైల్)

భైంసారూరల్: ఆర్థిక సమస్యలతో వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ కథనం ప్రకారం..మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన వక్కెర ప్రసాద్ (38) మేస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో శనివారం గ్రామ సమీపంలోని చెరువులో దూకాడు. ఆదివారం మృతదేహం తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, గ్రామస్తులు చందాలు వేసుకుని అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యానికి బానిసై ఒకరు..

చింతలమానెపల్లి: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ బారెగూడ గ్రామానికి చెందిన బోర్లె జయరాం (46) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈక్రమంలో ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కమలాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ మనో తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కిందపడి యువతి..


కోట సింధు (ఫైల్)

రెబ్బెన: రైలు కిందపడి యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఆసిఫాబాద్ మండలం అంకూసాపూర్‌లోని గొల్లవాడకు చెందిన కోట సింధు (19) వరంగల్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె శనివారం రాత్రి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్ దిగింది. స్టేషన్ నుంచి కొంతదూరం వెళ్లింది. రెబ్బెన మండలం పుంజుమేరగూడ సమీపంలో రైల్వే ట్రాక్‌పై బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకుంది. అయితే సింధు గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని ఆకారణంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..


సూర్యవంశీ యోగేశ్ (ఫైల్)

భైంసారూరల్: కడుపు నొప్పి భరించలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని చుచుంద్ గ్రామానికి చెందిన సూర్యవంశీ యోగేశ్ (22) భైంసాలోని ఓ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు భైంసాకు వెళ్లి దుకాణంలో పని చేసి ఇంటికి తిరిగివచ్చేవాడు. గత మూడేళ్లుగా పనిచేస్తూ నెలనెల సంపాదించిన డబ్బుల ఇంట్లో ఇచ్చేవాడు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూయించుకున్నా తగ్గకపోవడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యవంశీ యోగేశ్ మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యాభై వసంతాల సంబురం


స్వర్ణోత్సవ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

- బెల్లంపల్లిలో సీఎస్ఐ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- హాజరైన పూర్వవిద్యార్థులు, గురువులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో పదో తరగతి (1974–75 బ్యాచ్) చదివి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా పూర్వవిద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం వీరి అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. ఏడు పదుల వయస్సు దాటిన చిన్ననాటి స్నేహితులు ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ప్రసాదరావు, ప్రకాశరావు, మధుకర్‌పై పూలు జల్లుతూ ఆహ్వానం పలికి గురు భక్తిని చాటుకున్నారు. తమకు ఇది మధుర జ్ఞాపకంగా నిలుస్తుందని గురువులు పేర్కొన్నారు. పాఠశాలలో చదివిన పలువురు అడిషనల్ ఎస్పీలుగా, సీటీవోలుగా, సింగరేణి, ప్రభుత్వ శాఖల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించి ఉద్యోగ విరమణ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమ నిర్వహణకు పూర్వ విద్యార్థులు పట్టి శివకుమార్, ఎండీ సాదిక్, దాసరి రాజలింగు తదితరులు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

ఆత్మీయ సమ్మేళనం



రామకృష్ణాపూర్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 31 ఏళ్ల తర్వాత ఆదివారం క లుసుకున్నారు. గద్దెరాగిడిలోని భీమా గార్డె న్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయులు జగన్, యోగేశ్వర్, రోజ్‌మేరీ, కనకపూర్ణ, చంద్రసుశీల, మనోహర తదితరులు పాల్గొన్నారు.

కలుస్తామని అనుకోలేదు



15 ఏళ్ల వయస్సులో కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నాం. పదో తరగతి పూర్తయ్యాక విడిపోయాం. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు మరోసారి కలుస్తామని కలలో కూడా అనుకోలేదు. కానీ నేడు అది నిజమైంది. చిన్ననాటి స్నేహితులు మలిసంధ్య వయస్సులో కలుసుకోవడం చెప్పలేనంత ఆనందంగా ఉంది.

– సత్యనారాయణ, పూర్వ విద్యార్థి.

సంతోషం కలిగింది



మా ఒక్కొక్కరి వయస్సు 70 ఏళ్లు దాటాయి. ఈ వయస్సులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం సాధ్యమవుతుందా అని అనుమానపడ్డాం. ఏమైతే నేం చిన్ననాటి స్నేహితులు కలవడం మాలో చెప్పలేని సంతోషాన్నీ కలిగించింది.

– పూర్ణచందర్‌రావు, పూర్వ విద్యార్థి

ఈ జన్మలో ఇది చాలు



పూర్వ విద్యార్థుల సమ్మేళనం మా జీవితంలో ఎంతో అపురూపమైంది. ఇప్పుడు మేమంతా ఇంటి వద్ద సేద తీరే సమయం. మనుమలు, మనవరాళ్లతో గడిపేకాలం. అలాంటి పరిస్థితుల్లో ఉన్న మేము చిన్ననాటి స్నేహితులను మళ్లీ కలుసుకోవడం ఆనందంగా ఉంది. ఈ జన్మకు ఇంతకన్నా మాకు ఇంకేం కావాలి.

– ఎండీ సాధిక్‌పాషా, పూర్వ విద్యార్థి

తల్లికి తలకొరివి పెట్టిన తనయ

- నెన్నెలలో ఘటన


తల్లికి అంతిమ సంస్కారం నిర్వహిస్తున్న పోశక్క

నెన్నెల: అనారోగ్యంతో మృతిచెందిన తల్లికి తనయ తలకొరివి పెట్టింది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నెన్నెల కాపువాడలో ఉంటున్న పొట్లపల్లి రాజక్క శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. కుమారుడు ఏడాది క్రితం ఇతర రాష్ట్రానికి వలస వెళ్లిపోయాడు. అతని ఆచూకీ లభించకపోవడంతో ఆ గ్రామంలో ఉంటున్న చిన్నకూతురు పోశక్క ఆదివారం తన తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. తలకొరివి పెడుతున్న దృశ్యాలు అక్కడికి వచ్చిన బంధుమిత్రులందరికీ తంటతడి పెట్టించింది.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ


బైక్‌పై దుండగులు వెళ్తున్న సీసీ ఫుటేజ్

ఆదిలాబాద్‌టౌన్: గుర్తుతెలియని ఇద్దరు దుండగులు మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. పట్టణంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన స్వప్న..వినాయక్ చౌక్ నుంచి శాంతినగర్ వైపు కాలినడకన వెళ్తోంది. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో బైక్‌పై ఇద్దరు దుండగులు ఆమె మెడలో రెండున్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. మహిళ కేకలు వేయగా ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


పాక్షికంగా కాలిపోయిన పత్తి

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైంది. రైతు రౌతు మధుకర్ ఇంట్లో సుమారు 15 క్వింటాళ్ల పత్తి నిల్వ చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పత్తికి మంటలు అంటుకున్నాయి. రైతు వెంటనే నీళ్లు పోసి మంటలార్పేశాడు. ప్రమాదంలో సుమారు 4 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైంది. రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

'తప్పుడు ప్రచారం మానుకోవాలి'


మాట్లాడుతున్న తిప్పారపు సారయ్య

జైపూర్: ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోకెన్ సమ్మె విజయవంతమైంది. కానీ యాజమాన్యం చేస్తున్న తప్పుడు ప్రచారం మానుకోవాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1040 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటే ఉన్నతాధికారుల మెప్పుపొందడానికి ఎస్టీపీపీ యాజమాన్యం అసత్య ప్రచారం చేస్తోందన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు విక్రమ్, కృష్ణారెడ్డి, సంపత్ ప్రదీప్‌రెడ్డి, నవీన్, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీడిన బాలుడి హత్య మిస్టరీ


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు జాగిలం

- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్

నిర్మల్‌టౌన్: నిర్మల్‌రూరల్ మండలం చిట్యాల శివారులోని చింతల చెరువు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన బాలుడి హత్య మిస్టరీ వీడింది. 24 గంటల్లోనే పోలీసులు కేసు ఛేదించారు. జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ రాజేశ్ మీనా ఈమేరకు వివరాలు వెల్లడించారు. చిట్యాల గ్రామానికి చెందిన తోకల రాజేశ్వర్‌కు హోమో సెక్స్ అలవాటు ఉంది. అదే గ్రామానికి చెందిన అడిగెల రిషి (14) గ్రామ శివారులోని కల్లుబట్టీలో పనిచేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం పనికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లేక్రమంలో అర్ధరాత్రి బాలుడిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయట తెలిసిపోతుందని మద్యం మత్తులో బాలుడి మర్మాంగాలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు. శనివారం ఉదయం అటువైపు వెళ్లిన గ్రామస్తులు గమనించి తల్లి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ నేతృత్వంలో జిల్లా డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు రాజేశ్వర్‌ను 24 గంటల్లోనే పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఏఎస్పీతోపాటు రూరల్ సీఐ రామకృష్ణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్సై లింబాద్రి, సందీప్, సాయికిరణ్‌లను ఎస్పీ అభినందించారు.

ఐక్యతతోనే బీసీ హక్కులు సాధ్యం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

శ్రీరాంపూర్: ఐక్యతతోనే బీసీ ఉద్యోగులు, అధికారులు తమ హక్కులు సాధించుకుంటారని సింగరేణి బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సీసీసీలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా బీసీ ఉద్యోగులు, అధికారులు నేడు ఐక్యమై ముందుకు కదులుతున్నారన్నారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం అసోసియేషన్ పోరాడుతుందన్నారు. కంపెనీ వ్యాప్తంగా 11 ఏరియాల్లో బీసీ లైజన్ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. చీఫ్ లైజన్ అధికారి హరిశంకర్‌రావు, చీఫ్ అడ్వయిజర్ చిలుక శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి జీఎం కార్యాలయం ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటుతోపాటు ఆయన జయంతిని యాజమాన్యం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఆ రోజున వేతనంతో కూడిన సెలవును ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంను జ్యోతిరావు పూలే స్టేడియంలో మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహాసభలో పది తీర్మానాలు చేసి వాటిని ఆమోదించారు. ఏరియా ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవింద్ రావు, ఏజెంట్ రాజేందర్, ఏరియా ఎస్పీ లైసెనింగ్ అధికారి కిరణ్ కుమార్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.